


మచిలీపట్నం హిందూ కళాశాల ప్రాంగణంలో రంగవల్లులను తీర్చిదిద్దుతున్న యువత, మహిళలు





ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరుల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న బి.అరుణ, ఎస్.స్వప్నసుందరి, బి.రమ్యశ్రీ

రంగవల్లుల సంబరం

- బందరులో ఉత్సాహంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలు
- రంగోలి వేడుకలో ఆకట్టుకున్న రంగులు
- విజేతలకు బహుమతుల ప్రదానం

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్ వారి సెల్వియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్), కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని హిందూ కళాశాల ఆవరణలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. తెలు8లోవారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. మొదటి బహుమతిని మచిలీపట్నానికి చెందిన బి.అరుణ, రెండో బహుమతిని ఎస్.స్వప్న సుందరి, మూడో బహుమతి బి.రమ్యశ్రీ గెలుచుకున్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

రైల్వే స్టేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి దక్షిణ మధ్య రైల్వే వివిధ స్టేషన్ల మధ్య 22 రూట్లలో 52 అదనపు రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఆదివారం ప్రకటించారు. ఈ రైళ్లు ఈ నెల 6వ తేదీ నుంచి పట్టాలు ఎక్కనున్నాయి. చర్లపల్లి - తిరుపతి, వికారాబాద్ - కాకినాడ టౌన్, కాచిగూడ - తిరుపతి, చర్లపల్లి - నరసాపూర్, కాకినాడ టౌన్ - సికింద్రాబాద్, కాకినాడ టౌన్ - చర్లపల్లి, నాందేడ్ - కాకినాడ టౌన్, చర్లపల్లి - శ్రీకాకుళం టౌన్, కాచిగూడ - శ్రీకాకుళం రోడ్డుల మధ్య అప్ అండ్ డౌన్‌గా 22 రైళ్లు తిరగనున్నాయి. వీటి కాల పట్టికను వెబ్ సైట్ ద్వారా లేదా రైల్వే ఎంక్వయిరీ ద్వారా తెలుసుకోవచ్చు.

మెట్లపల్లిలో మరో చిరుతపులి కలకలం

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలోని మెట్లపల్లి శివారులో మరో చిరుతపులి కలకలం రేపింది. డిసెంబరు 18వ తేదీ రాత్రి మెట్లపల్లి తోటలో అడవి పందుల కోసం పెట్టిన ఉచ్చులో పడి ఓ చిరుతపులి మృతిచెందిన సంఘటన తెలిసిందే. అది మరువక ముందే ఆదివారం తెల్లవారుజామున అదే ప్రాంతంలో రోడ్డు దాటుతున్న పులిని చూసినట్లు ఆర్టీసీ కండక్టర్ రవికుమార్ తెలిపారు. దీంతో గ్రామంలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆయన గన్నవరం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున ఆ రూట్‌లో డ్యూటీకి వెళ్తుండగా, పులి కనిపించిందని కండక్టర్.. సగ్గూరు గ్రామస్తులకు చెప్పాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మెట్లపల్లి, వీరపనేనిగూడెం గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా, గార్డు కుమారి పులి కనిపించిన ప్రాంతంలో పరిశీలన జరిపారు.

కాషాయ సంద్రం



కేసరపల్లిలో హైందవ శంఖారావం విజయవంతం

హాజరైన మూడు లక్షల మంది హిందువులు

ఆలయాలకు స్వయం ప్రతిపత్తిపై పూరించిన శంఖం

దేవాలయాల భూముల అన్యాక్రాంతంపై పీఠాధిపతుల ఆగ్రహం

విజయవాడ, గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు స్వయం ప్రతిపత్తే లక్ష్యంగా కేసరపల్లిలో ఆదివారం నిర్వహించిన 'హైందవ శంఖారావం'సభ దద్దరిల్లింది. దేశవ్యాప్తంగా తరలివచ్చిన హైందవ సమాజంతో కేసరపల్లి కాషాయ సంద్రంగా మారింది. సభకు మూడు లక్షల మంది తరలివచ్చారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న ఏకైక డిమాండ్‌తో ఈ హైందవ శంఖారావాన్ని నిర్వహించారు. హైందవ శంఖారావంలో ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశానికి చెందిన వంద మందికి పైగా పీఠాధిపతులు, స్వామిజీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూపరిషత్ కేంద్రీయ సంఘటన అధ్యక్షుడు గోకరాజు గంగరాజు అధ్యక్షత వహించారు. విశ్వహిందూ పరిషత్ సంఘటన ఉత్తరాంధ్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్ కార్యక్రమాన్ని నడిపించారు. శంఖనాదాల హోరుతో హైందవ శంఖారావం ప్రారంభమైంది. అశేష హైందవ సమాజం సమక్షంలో కార్యక్రమం ఐదు గంటల పాటు సాగింది. హైందవ శంఖారావంలో వీహెచ్‌పీ అగ్రనాయకులు, మఠాధిపతులు, స్వామిజీలు అందరూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర మతాలకు వారి దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉన్నపుడు హిందూ దేవాలయాలను ప్రభుత్వం పరిధిలోకి తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డులు ఏర్పాటు చేసి రాజకీయ నాయకులకు పునరావాసం కల్పించారని ఆరోపించారు.





కేసరపల్లి హైందవ శంఖారావం సభకు హాజరైన అశేష జనవాహిని, (ఇన్‌సెట్‌లో) పీఠాధిపతులు, నిర్వాహకులు

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం బస్తాల్లో నింపుతున్న రైతులు



టార్గెట్ పూర్తయ్యిందంటున్న 40 మిల్లులు

మిగిలిన మిల్లుల్లో బస్తా రూ.1,600 మించి ఇవ్వలేమంటున్న మిల్లర్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తయిందని కొందరు, బస్తాకు రూ.1600 మించి ధర ఇవ్వలేమని మరికొందరు మిల్లర్లు చెప్పడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే జిల్లాలో 147 రైస్ మిల్లులు ఉండగా, వాటిలో సుమారు 45 మిల్లులకు గతంలో ప్రభుత్వం కేటాయించిన టార్గెట్ పూర్తయింది. మిగిలిన మిల్లులు ధాన్యం కొనాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటి వరకు 3.50 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. మరో రెండు లక్షల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. -ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

- ప్రభుత్వ లక్ష్యం ఐదున్నర లక్షల టన్నుల కొనుగోలు
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది మూడున్నర లక్షల టన్నులే..
- మిల్లర్ల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ధర తగ్గించి ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఇంకా టార్గెట్ పూర్తి కాని మిల్లు యజమానులు ధరలో కోతపెట్టి ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. 75 కిలోల బస్తా రూ.1,725 మద్దతు ధరగా చెల్లించాల్సి ఉండగా, రూ.1600 మించి ధర ఇవ్వలేమని స్పష్టం చేస్తున్నారు. దీంతో రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళితే, రైతులు కోరిన మిల్లుకు టార్గెట్ పూర్తయిందని, ధాన్యం విక్రయానికి సంబంధించి ఆన్‌లైన్‌లో ట్రక్‌షీట్ జనరేట్ కావడంలేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. దూర ప్రాంతాల్లోని మిల్లులకు ధాన్యం విక్రయించాలంటే రవాణా చార్జీలు, కాటా కూలీ రైతులే భరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పరిచయం లేని మిల్లు యజమానులకు ధాన్యం విక్రయిస్తే నగదు సకాలంలో చేతికి అందుతుందో లేదోననే అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి.

టార్గెట్ పెంచాలని పలువురు మిల్లర్ల విజ్ఞప్తి

రైతుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో మిల్లు యజమానులు తమ టార్గెట్‌లను పెంచాలని పౌరసరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికే మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ చూపిన దాని కన్నా రెట్టింపు మొత్తంలో ధాన్యం ఇచ్చామనీ, టార్గెట్‌లు పెంచటానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలనీ, అప్పటివరకూ తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు.

3.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో 2024 ఖరీఫ్ సీజన్‌లో 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు చేశారు. బుడమేరు వరదలు, భారీ వర్షాల వల్ల పైరు దెబ్బతింది దీంతో జిల్లాలో 13 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనాను 9.50 లక్షల టన్నులకు వ్యవసాయశాఖ అధికారులు కుదించారు. ప్రభుత్వం ద్వారా 5.50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మిగిలిన సన్నరకాలను ధాన్యం రైతులు ప్రైవేటుగా విక్రయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఇప్పటి వరకూ జిల్లాలో 3.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీనిలో 30 వేల టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి ఇతర జిల్లాల్లోని మిల్లులకు తరలించింది. ఇంకా రెండు లక్షల టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం వరికోతలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. రెండవ పంటగా మినుమును సాగుచేసిన రైతులు మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల, పామర్రు, ఉయ్యూరు, గూడూరు తదితర మండలాల్లో వరిపంటను కుప్పలుగా వేసి ఉంచారు. మినుముతీత సమయంలో రైతులు కుప్పనూర్పిడి చేస్తారు. మినుముతీతకు ఇంకా రెండు నెలలపైగానే సమయం పడుతుంది. ఈలోగానే మిల్లర్లు తమ టార్గెట్‌లు పూర్తయ్యాయనీ, ధాన్యం కొనుగోలు చేయమని చెప్పడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో రైస్ మిల్లులకు టార్గెట్‌లు పూర్తికావడంతో మండపేట, తిరుపతి, గుంటూరు తదితర ప్రాంతాల్లోని మిల్లులకు ధాన్యం విక్రయించేందుకు వ్యాపారుల ద్వారా రైతులు ముందుకు వస్తున్నారు. అయితే వ్యాపారులు ఇదేసాకుగా తీసుకుని 75 కిలోల బస్తాకు రూ.1725 మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా, రూ.1,600 మాత్రమే ఇస్తామంటున్నారు. రవాణా చార్జీలు ఇతరత్రా రూపంలో తమపై భారం పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

బీపీటీ 5204 ధాన్యానికి పెరగని ధర

భారీ వర్షాలకు వరిపైరు దెబ్బతినడంతో జిల్లాలో 30 వేల హెక్టార్లకు పైగా తక్కువ రోజుల వ్యవధిలో కోతకు వచ్చే బీపీటీ-5204 రకం వరి విత్తనాన్ని రైతులు రెండో సారి సాగు చేశారు. ఈ రకం ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. బస్తా పాత ధాన్యం గతేడాది నవంబరు వరకు రూ.2800 వరకు ధర పలికింది. హైదరాబాద్ వ్యాపారులు అధిక ధర చెల్లించి మరీ కొనుగోలు చేసేవారు. అయితే ఈ ఏడాది హైదరాబాద్ వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ధాన్యం లారీలను రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద నిలిపి వెనక్కు పంపేస్తున్నారు. ఇప్పటి వరకూ జిల్లా నుంచి వెళ్లిన 25 లారీలకుపైగా వెనుదిరిగి వచ్చాయి. తేమశాతంతో పనిలేకుండా బస్తాకు రూ.1950 నుంచి రూ.2వేల వరకు ధర వస్తుందని రైతులు ఆశించగా, ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీంతో ముతకరకాల ధాన్యం మాదిరిగానే బీపీటీ రకం ధాన్యం కూడా బస్తాకు రూ.1600 నుంచి రూ.1700 వరకు కొనుగోలు చేస్తున్నారు. బీపీటీ సాగు చేసిన రైతులకు ఈ ఏడాది నిరాశే ఎదురవుతోంది.



విజ్ఞాన వెలుగు

పుస్తక మహోత్సవానికి పోటెత్తిన ప్రజలు

నేడు పుస్తక ప్రియుల పాదయాత్ర

ప్రారంభించనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

విజయవాడ కల్చరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న విజయవాడ పుస్తక మహోత్సవానికి సందర్శకులు ఆదివారం పోటెత్తారు. స్టాల్స్‌లో ప్రదర్శించిన విజ్ఞాన సంపదను ఆసక్తిగా తిలకించారు. మనస్సుకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. ఏటా నిర్వహించే పుస్తక ప్రియుల పాదయాత్ర సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ హాజరవుతారు. ఆయన జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించనున్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారు. ఈ యాత్ర మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల నుంచి ప్రారంభం కానుంది.

కమ్మవారిపై ఐదేళ్లు యుద్ధం!

- కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాల్లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వ్యాఖ్యలు

6లో

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం

- జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మండలి





మోగిన శంఖం


కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు





సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజీ మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద



హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

ఆలయాల విముక్తి కోసం పోరాడదాం

● వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటన అధ్యక్షుడు గోకరాజు గంగరాజు



విజయవాడ, గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల రక్షణకు ఎన్నో బలిదానాలు, పోరాటాలు జరిగాయని, హిందూ దేవాలయాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోవటంతో రాజకీయ నేతల పునరావాసకేంద్రంగా మారిపోయిందని వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటన అధ్యక్షుడు గోకరాజు గంగరాజు అన్నారు. కృష్ణాజిల్లా కేసరపల్లిలో జరిగిన హైందవ శంఖారావంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా హిందూదేవాలయాలపై దాడులు పెరిగిపోయాయని, హిందూ ఆలయాల స్వయం ప్రతిపత్తి కోసం జాతీయ ఉద్యమం ప్రారంభమైందన్నారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు నడుం బిగించాలని హిందూ దేవాలయాల విముక్తి కోసం పోరాటం జరుగుతుందన్నారు.

స్వేచ్ఛను కోల్పోవడం బాధాకరం

● తనికెళ్ల సత్యరవి కుమార్

వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటన కార్యదర్శి

స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లవుతున్నా ఇప్పటికీ దేవాలయాల స్వయంప్రతిపత్తి కోసం ఉద్యమించటం బాధగా ఉంది. హిందూ దేవాలయాలు స్వేచ్ఛను కోల్పోవటం ఇంకా బాధగా ఉంది. ఈరోజు ఆలయాలు అగ్నిపరీక్ష ఎదుర్కొంటున్నాయి.

ప్రతి మహిళ కదలి రావాలి

● కొండవీటి మాతా జ్యోతిర్మయి



ప్రతి ఇంట్లో స్త్రీ వేదాధ్యయనం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. వేదాలను అధ్యయనం చేయటం ద్వారా దేవాలయాల పరిరక్షణ కోసం పాటుపడేతత్వం పెరుగుతుంది. లవ్‌జిహాద్ అరికట్టాలన్నా కూడా మహిళలు చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉంది.

ఎస్సీలంతా హిందువులే

● గరికముక్కు సుబ్బయ్య, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం

ఎస్సీ, ఎస్టీలంతా హిందువులే. 1950లో బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీల్లో అంటరానితనం అనుభవిస్తున్న హిందువులకు రిజర్వేషన్లు కల్పించారు. ఈ రోజున అన్యమతస్తులు కూడా రిజర్వేషన్లు పొందుతున్నారు. మతం మారిన వారంతా వెనక్కు రండి. ఎస్సీల్లో ఉన్న వాళ్లు హిందువులుగానే ఉండాలి. లేదంటే బయటకు వెళ్లిపోండి.

స్వయంప్రతిపత్తికి నడుం బిగిద్దాం

● దక్షిణాంధ్ర వీహెచ్‌పీ అధ్యక్షుడు సాయిరామ్

హిందూ సమాజం మూడు ప్రమాదాలను ఎదుర్కొంటోంది. అన్యమతస్థుల నుంచి దాడులు, పోలీసు కేసులు, ప్రభుత్వాల ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇంకెన్నాళ్లీ అవమానాలు. ఇప్పటికైనా స్వయం ప్రతిపత్తికి నడుం బిగిద్దాం.

దాడుల్ని ఖండించాలి

● శివానంద సరస్వతి



హైందవ సమాజంపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి. కాషాయమంటే అగ్నివర్ణమని దాంతో పెట్టుకున్న వారిని దహించి వేస్తుంది. ఇన్నాళ్లూ సహనంగా ఉన్నాం. ఇకపై హైందవ సమాజం, కాషాయధారులపై దాడులు జరిగితే సహించేది లేదు. వీహెచ్‌పీ ఏపీ ట్రెజరర్ వీ దుర్గాప్రసాదరాజు, ఎస్ఎల్‌వీ గ్రూప్ ఛైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, యార్లగడ్డ వెంకట్రావు, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, విజయా డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, చిగురుపాటి కుమారస్వామి, పొట్లూరి బసవరావు, ఆళ్ల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన శంఖారావం బహిరంగ సభ

విజయవాడ, గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం బహిరంగ సభ ఆదివారం జరిగింది. అతిథులంతా మధ్యాహ్నం 12.30 గంటలకు వేదికపైకి వచ్చారు. 12.43కు శంఖారావాన్ని పూరించారు. 12.45కు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవింద దేవ్ గిరి మహరాజ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. 12.49కి ఓం, ఓం, ఓం, శ్రీరామ, జయరామ అంటూ జపించారు. అనంతరం కన్వీనర్ తనికెళ్ల సత్యరవికుమార్ వేదికపై ఉన్నవారిని పరిచయం చేశారు. విశ్వహిందూ పరిషత్ అఖిల భారత ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు సభకు అధ్యక్షత వహించారు. వేదికపై 85 మంది స్వామీజీలు ఆశీనులయ్యారు. వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అఖిల భారత సంఘటన ప్రధన కార్యదర్శి మిలింద్ పరాండే, అయోధ్య ట్రస్టు కోశాధికారి గోవింద దేవ్ గిరి మహరాజ్‌లు హిందీలో మాట్లాడగా తెలుగులో అనువాదించారు. హైందవ శంఖారావం డిక్లరేషన్‌ను ప్రకటించారు. చినజీయర్ స్వామి సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. సాయంత్రం 5.10 గంటలకు వేదికపైనున్న స్వామీజీల అభివాదంతో హైందవ శంఖారావం ముగిసింది.

3,500 బస్సులు, 10 రైళ్లు, 2వేల కార్లు



హైందవ శంఖారావం బహిరంగ సభలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

కాగా ఈ బహిరంగ సభకు అనేక వాహనాలలో హైందవ కుటుంబీకులు వచ్చారు. 3,500 బస్సులు, 10 ట్రైన్‌లు, 2వేల కార్లు, 15వేలు బైకుల్లో బహిరంగ సభకు హైందవ కుటుంబీకులు తరలివచ్చారు. ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ గంగాధరరావు పర్యవేక్షణలో 4వేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉప్పులూరు రైల్వే స్టేషన్ నుంచి సభాస్థలికి వచ్చే మార్గంలో పోలీసులు ఉండి వరుస క్రమంలో పంపించారు. ట్రాఫిక్‌ను సజావుగా పంపించారు. కేసరపల్లి నుంచి రామవరప్పాడు వరకూ ట్రాఫిక్‌ను నిలుపుదల చేయటంతో స్థానికులు కాస్త ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ముందుగా సూచించిన విధంగానే వాహనాలను మళ్లించారు. పోలీసులు ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. విధులలో ఉన్నవారిని ఐజీ, ఎస్పీలు ప్రతిక్షణం అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి వాహనాలు వెళ్లేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు పాటించటంతో ట్రాఫిక్ అంతగా కనిపించలేదు. కదిరి నుంచి 100 మంది స్కూటర్లపై మూడు రోజులుగా ప్రచారం చేస్తూ వచ్చారు. మొత్తం 5చోట్ల భోజన ఏర్పాట్లు చేశారు. సావరగూడెం, ఉప్పులూరు రోడ్డు, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, ఐటీ పార్క్ ప్రక్కన, హెచ్‌సీఎల్ దగ్గర పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. నాలుగువైపుల నుంచి వచ్చే వాహనాలు అటువైపే పార్కింగ్ చేసుకునేలా తగిన చర్యలు చేపట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలగలేదు.



క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాకారులకు అందిస్తున్న ఎమ్మెల్యే

క్రీడలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

● జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన ఎమ్మెల్యే మండలి

మోపిదేవి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం మోపిదేవిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులపాటు జరిగే ఉమ్మడి కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, క్రీడా ఉపాధ్యాయులు గురుకుల పాఠశాల బోధన సిబ్బంది బుద్ధప్రసాద్‌కు గౌరవ వందనం సమర్పించారు. క్రీడా జ్యోతిని వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో పాల్గొంటే విద్యార్థులు క్రమశిక్షణతోపాటు సమాజంలో ఐక్యతను సాధించుకోగల్గుతారన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ కోర్టులను ఎమ్మెల్యే ప్రారంభించగా, విద్యార్థులతో కలిసి ఆటలాడి ఉత్సాహపరిచారు. గ్రామసర్పంచ్ నందిగం మేరీ రాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి, పీఈటీ కేవీ సత్యనారాయణ, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బి.నాగబాబు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాయామోపాధ్యాయులు ఉన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు

మున్సిపల్ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్

రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

గవర్నర్‌పేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ప్రధాన భూమిక పోషిస్తున్న మున్సిపల్ శాఖ కార్పొరేషన్ ఉద్యోగులకు కనీసం సర్వీస్ రూల్స్ లేకపోవడం బాధాకరమని ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక శ్రీపాద హోటల్‌లో ఆదివారం జరిగిన మున్సిపల్ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. మాజీ అధ్యక్షుడు దోప్పలపూడి ఈశ్వర్ అధ్యక్షత వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తిమ్మసర్తి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వీస్ రూల్స్ ఏపీలో పాటించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు సొంతంగా సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీసీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శంకర్, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.అరలయ్య, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం అధ్యక్షురాలు పారే లక్ష్మీ, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మీ పాల్గొన్నారు.



'కమ్మవారి సేవా సమితి' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

కమ్మవారిపై ఐదేళ్లు యుద్ధం!

- కమ్మ సేవా సమితి సంక్రాంతి సంబరాల్లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వ్యాఖ్యలు
- కమ్మ సేవా సంఘం సేవలు శ్లాఘనీయం
- ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, సుజనా ప్రశంసలు

కంకిపాడు (గంగూరు), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు కమ్మ సమాజంపై కొందరు బహిరంగ యుద్ధం చేశారని, ఇప్పుడు వారేమయ్యారో అందరికీ తెలుసునని పరోక్షంగా వైసీపీ పాలనపై రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) విమర్శలు గుప్పించారు. అందుకే ఈ సంక్రాంతిని విమోచన, విముక్తి దినంగా భావించాలని సూచించారు. కృష్ణా జిల్లా కమ్మవారంటే ఆషామాషీ కాదని, తెలుగు సమాజానికి సేవలందించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని గంగూరులోని ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం 'కమ్మవారి సేవా సమితి' ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, బోడే ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీవీ మాట్లాడుతూ కృష్ణా జిల్లా అనేక మంది ప్రముఖులకు పుట్టినిల్లని, ఎన్టీఆర్, రామోజీరావు, ఘంటసాల, విశ్వనాథ సత్యనారాయణ, కాకాని వెంకటరత్నం సహా అనేక మంది ఇక్కడే జన్మించారన్నారు. కృష్ణా జిల్లా వారిని విమర్శించే వ్యక్తులు.. వారికి దమ్ముంటే 'అంధ్యాంక్‌'ను పునరుద్ధరించాలని వ్యాఖ్యానించారు. విమర్శకులకు దమ్ముంటే మరో రామోజీరావును చూపించాలన్నారు. గత ఐదేళ్ల జరిగిన సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసుకోవాలి. కమ్మ సామాజిక వర్గంలో అనేక మంది పేదరికంలో కొట్టు మిట్టాడుతున్నారన్నారు. అలాంటి వారికి సహకారం అందించాల్సిన అవసరముందన్నారు. వారిని ప్రోత్సహిస్తే మన పిల్లల్లో మరో సత్యానాదెళ్ల, ఎన్టీఆర్‌లను చూసుకోవచ్చునన్నారు.

సేవలు భేష్: బోడె, సుజనా

కమ్మ సేవాసమితి నిర్వహించిన సంబరాలతో సంక్రాంతి పండుగ ముందే వచ్చిందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ కమ్మ సేవా సంఘం ద్వారా అనేక మంది పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని, వారి సేవలు బాగున్నాయని కొనియాడారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంత వరకు కులాలు, మతాలు ఉంటాయన్నారు. ఇతర కులాలను ఎవరూ కించపరచొద్దని సూచించారు. అన్ని కులాలు, మతాలు కలిసి పనిచేస్తేనే రాజ్యాధికారం వస్తుందని తెలిపారు. జలవనరుల శాఖ సలహాదారు కన్నయ్యనాయుడు, ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు. అనంతరం 'కమ్మవారి సేవాసమితి' క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ అభివృద్ధికి సహకరిస్తా

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

వన్‌టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించి, వ్యాపారస్థులకు అండగా ఉంటానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం వన్‌టౌన్‌లోని గాంధీజీ మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా డూండీ రాకేష్ పదవీబాధ్యతలు చేపట్టి, ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సవిత మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో వ్యాపారస్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారాలను సక్రమంగా నిర్వహించుకుంటున్నారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎన్నికల్లో టీడీపీకి ఏకపక్షంగా మద్దతు ప్రకటించారన్నారు. డూండీ రాకేష్ ప్రమాణ స్వీకారం జాతిపిత గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో జరగటం ఆనందంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా డూండీ రాకేష్ ముందుంటాడన్నారు. డూండీ రాకేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు, చిరు వ్యాపారస్థులు, మధ్యతరగతి వర్గాల వారిని మరింత బలోపేతం చేయటానికి కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్ ద్వారా వ్యాపారస్థులకు లోన్లు ఇచ్చి వారిని ఆదుకుంటానన్నారు. వైసీపీ పాలనలో వ్యాపారస్తులు అనేక విధాలుగా నష్టపోయారని, కొందరు వ్యాపారస్తులు దుకాణాలను మూసివేశారని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, కామినేని శ్రీనివాస్, జి.వి.ఆంజనేయులు, కాలువ శ్రీనివాస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్ మీరా, తదితరులు ప్రసంగించారు. అనంతరం డూండీ రాకేష్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు. కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నేతలు వి.వి.కె.నరసింహారావు, కొణిజేటి రమేష్, టీడీపీ నేతలు, కార్యకర్తలు, ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.



డూండీ రాకేష్‌ను అభినందిస్తున్న మంత్రి సవిత, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సౌమ్య

నేటి నుంచి బాలికల వాలీబాల్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల గ్రౌండ్స్ వేదికగా ఈ నెల 6నుంచి 10వరకు జరిగే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్-19 బాలికల టోర్నీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కే భానుమూర్తి రాజు తెలిపారు. జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా కార్యదర్శి వీ రవికాంత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ సహకారంతో విజయవాడకు జాతీయ పోటీల నిర్వహణకు సమాయత్తమయ్యామన్నారు. దేశవ్యాప్తంగా 44 జట్లు రావాల్సి ఉండగా, ఆన్‌లైన్ 26 జట్లు తమ సంసిద్ధతను తెలిపాయని, ఎక్కడా లోటుపాట్లుకు తావివ్వకుండా 17 కమిటీల పర్యవేక్షణలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 400 మంది క్రీడాకారిణులు బరిలో దిగుతున్నారని, లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 6న ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతాయని, లాంఛనంగా ఈ పోటీలను సాయంత్రం 5 గంటలకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై ప్రారంభిస్తారని వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడకు జట్లను ప్రత్యేక టీమ్‌ల ద్వారా రైల్వేస్టేషన్ నుంచి వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతాలు పలికి నార్త్, సౌత్ వంటకాలతో భోజనాలు, వసతికి హోటళ్లను బుక్ చేశామని, వారిని బస్సుల్లో వేదిక వద్దకు తీసుకువస్తావన్నారు. టెక్నికల్ కమిటీ అడ్వైజర్ దోనేపూడి దయాకర్‌రావు మాట్లాడుతూ ఫ్లడ్ లైట్ల వెలుతురులో 4 కోర్టుల్లో 33 మ్యాచ్‌లు జరుగుతాయని, 7న లీగ్ మ్యాచ్‌లు, 8న ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్ 9న సెమీస్, 10న ఫైనల్స్ అనంతరం విజేతలకు ట్రోఫీల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వర్లు, వీ రవికాంత, స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

స్ట్రీట్ బ్లడ్ - డెడ్ ఆర్ అలైవ్ పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్ జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వీధి కుటుంబాల జీవితాల్ని అద్దం పట్టే ప్రయత్నమే స్ట్రీట్ బ్లడ్: డెడ్ ఆర్ అలైవ్ నవల అని రచయిత రుద్రమల్ల ఆనంద్ మోహన్ అన్నారు. పుస్తక మహోత్సవంలో చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికపై నవల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. పిల్లలు నేరస్థులుగా మారడంలో పేదరికం, కుటుంబ వ్యవస్థ వైఫల్యం, గ్యాంగ్ కల్చర్ కీలక పాత్ర వహిస్తాయని ఇందులో చూపించానని ప్రోడిగల్ సన్స్ కథతో, తప్పిపోయిన వారు ఎలా మార్పు సాధించగలరన్న దానిపై దృష్టి పెట్టానని ఆయన చెప్పారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ మార్పు వ్యక్తిగతంగానే కాకుండా సమాజ స్థాయిలో అవసరమని ఈ రచన చెబుతుందన్నారు. అధికార భాష కమిషన్ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు భాషపై ఆసక్తిని, పఠన అభిలాషను విద్యార్థుల్లోనూ, ప్రజల్లోనూ విస్తృతంగా వ్యాపింపజేయడం, పాఠకుల సంఖ్యను పెంచడం కోసం పుస్తక మహోత్సవం దోహదపడుతుందన్నారు. ముష్టి శ్రీనివాస్, పుస్తక మహోత్సవ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు పాల్గొన్నారు.

తెలుగు చిత్రంపై భానుమతి ముద్ర

తెలుగు సినిమా గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి భానుమతి రామకృష్ణ అని, నటన, సంగీతం, రచన, దర్శకత్వం, నాటకాలు ఇలా ఆమె ప్రతిభ అపారమైందని ప్రముఖ సినీ పాత్రికేయుడు రెంటాల జయదేవ్ అన్నారు. ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై సినీ నటి భానుమతి రామకృష్ణ శతజయంతి సభ నిర్వహించారు. పురుషాధిక్యత నుంచి సంరక్షించుకోవడం కోసం తాను సృష్టించుకున్న తొడుగే అహంకారమన్నారు. సినిమా ప్రపంచంలో ఆత్మవిశ్వాసంతో, ప్రతిభతో సంపూర్ణ వ్యక్తిత్వంతో నిలిచిన గొప్ప నటి అన్నారు. సినిమాల్లోనూ బయట ఆమె నమ్మిన విలువలకు కట్టుబడి జీవించిందన్నారు. ఏ పాత్రను ధరించినా, ఆ పాత్రలో తన వ్యక్తిత్వాన్ని ఆరోపించి, ప్రేక్షకుల మెప్పు పొందిన ఘనత ఆమెదన్నారు. నటిగా, గాయకురాలిగా, రచయిత్రిగా, నిర్మాతగా, దర్శకురాలిగా, సంగీత దర్శకురాలిగా దాదాపు ఎనిమిది పాత్రలను సమర్థవంతంగా పోషించిన ప్రతిభను ఆమె సొంతమన్నారు. సభకు అధ్యక్షత వహించిన పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ బహుముఖ ప్రతిభతో సినిమారంగంలో ధ్రువతారగా వెలిగిన నటి భానుమతి రామకృష్ణ అని అన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్లింపు

హనుమాన్‌జంక్షన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేసరపల్లిలో హైందవ శంఖారావం బహిరంగ సభ జరిగిన సందర్భంగా హనుమాన్‌జంక్షన్‌లో గన్నవరం మీదుగా రద్దీ పడకుండా ఆదివారం వాహనాలను మళ్లించారు. ట్రాఫిక్ నిర్వహణకు ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 170 మంది పోలీస్ సిబ్బందని జంక్షన్‌లో బందో బస్తుకు కేటాయించారు. హైదరాబాద్ వెళ్లే వాహనాలను నూజవీడు, చెన్నై వెళ్లే వాహనాలను గుడివాడ మీదుగా మళ్లించారు.



ట్రాఫిక్ మళ్లిస్తున్న పోలీసులు

బరులు రెడీ



- యంత్రాలతో చకచకా సాగుతున్న పనులు
- కాటూరు- కాలవపాముల మధ్య 8 ఎకరాల్లో ఏర్పాట్లు
- బోళ్లపాడులో 4 ఎకరాల్లో బరి

(ఉయ్యూరు-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండుగకు మూడురోజుల పాటు కోడిపందేలకు బరులు శరవేగంతో సిద్ధమవుతున్నాయి. కాటూరు పంచాయతీ పరిధిలో కాటూరు- కలవపాముల ఆర్‌అండ్‌బీ రోడ్డుపక్కన 8 ఎకరాల మాగాణి పొలంలో సువిశాలంగా పెద్దయెత్తున బరులు ఏర్పాటు చేస్తుండగా పనులు చకచకా జరుగుతున్నాయి. పెద్ద మొత్తంలో పందేలకు పెద్ద బరి, చిన్న పందేలకు చిన్న బరి ఏర్పాటు చేస్తుండగా 1500 మంది పందేలు కూర్చుని తిలకిం చేందుకు, పందేలా రాయుళ్లు రాత్రివేళ బసకు అవసరమైన వసతులు, పందేలకు వచ్చేవారి వాహనాల పార్కింగ్‌కు బరుల పక్క పంట పొలా న్ని రోలర్, జేసీబీలతో చదును చేస్తున్నారు. బరుల చుట్టూ ఇనుప వైపులు పాతి పెన్సింగ్ వేసేలా పనులు కొన సాగుతున్నాయి. బోళ్లపాడులో ఎప్పటిలాగే 4 ఎకరాల్లో బరి సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఏడాది స్థానిక వైసీపీ నాయకుడు ఆధ్వర్యంలో మూడు రోజులు పెద్దయెత్తున కోడి పందేలు, కాయ్‌రాజా కాయ్, వంటివి జరిగేవి. ఈ సారి అధికార పార్టీకి చెందిన వారు బరులు సిద్ధం చేస్తున్నారు. ఆకునూరులో పెద్దఎత్తున బరులు ఏర్పాటు చేసేందుకు స్థానిక నాయకులు పనుల్లో నిమగ్నమై ఉన్నారు.



కాటూరులో సిద్ధం చేస్తున్న కోడిపందేల బరులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత అన్నే ధనయ్య, చలసాని రాధాకృష్ణమూర్తి

పేదలకు దుప్పట్ల పంపిణీ

కంకిపాడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థి, టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో 1983 - 84 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నే ధనయ్య మాట్లాడుతూ, 40 ఏళ్ల తరువాత ఆనాటి స్మృతులను గుర్తు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. ఆత్మీయ కలయిక సందర్భంగా సుమారు 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చలసాని రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

ఉయ్యూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం సోమవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు మండల తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరూ ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని, ప్రజలు సమస్యలకు సంబంధించి వినతిపత్రం అందజేసి పరిష్కారం పొందాలని తెలిపారు.

10న ముగ్గుల పోటీలు

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు జరుగుతాయని, పోటీల్లో పాల్గొనే మహిళలు ముగ్గులు, రంగులు తెచ్చుకోవాలని, ఉప్పు, రసాయనాలు వాడకూడదని, 8వ తేదీ లోపు 98850-68099 నెంబర్‌కు సంప్రదించి ఎంట్రీలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. పాతికేళ్ల తరువాత కలుసుకున్న వారంత ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకు న్నారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, ఎంతో మంది విద్యార్థులకు చక్కటి మార్గదర్శిగా సెయింట్ జాన్స్ పాఠశాల నిలిచిందన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కె.వాసు, వై.హరివిశ్వనాథ్, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఉయ్యూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ సేవా దళ్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగకు పేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక తేజ డిజిటల్స్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజ ఉయ్యూరు మండల యువజన సంఘం అధ్యక్షుడు పేరూరి నిఖిల్, కొల్లిపర హేమంత్, వెంట్రప్రగడ వీరాం జనేయులు, నేరెళ్ల వేణు పాల్గొని సేవలందించారు.

మత విశ్వాసాలను రెచ్చగొడుతున్న బీజేపీ

సీపీఎం నేత వై.నరసింహారావు

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత విశ్వాసాలను రెచ్చగొట్టేందుకు విశ్వహిందూ పరిషత్‌కు ముందు పెట్టి బీజేపీ వెనుక ఉండి నాటకం ఆడుతుందని ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఎర్రజెండాపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల స్థాయి విస్తృత సమావేశం కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ హైందవ శంఖారావం పేరుతో కేసరపల్లిలో జరిగిన సభ ఉద్దేశం హిందూ తత్వాన్ని రెచ్చగొట్టడమేనన్నారు. ఈ సమావేశంలో కళ్ళం వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు



గురువులు వెంటరాగా తంబి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కొనసాగుతున్న నవదిన ప్రార్థనలు

ఉంగుటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ కథోలికా పుణ్యక్షేత్రంలో దైవసేవకుడు బ్రదర్ జోసఫ్‌తంబి 80వ వర్ధంతి మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలు ఆదివారం రెండవరోజు కొనసాగాయి. సాయంత్రం 6గంటలకు ప్రారంభమైన ఈప్రార్థనలకు ముఖ్యఅతిథిగా తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం మేత్రాసనం కోశాధికారి రెవ.ఫాదర్ సూరేపల్లి ఐజాక్ విచ్చేశారు. తొలుత గురువులు వెంటరాగా గుడిపెద్దలు, సంఘపెద్దలతో కలిసి చర్చి ప్రాంగణంలోని తంబి చిత్రపటం, లోహపుశిలువను క్షేత్రప్రాంగణంలోని తంబి కళావేదిక వద్దకు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ఫాదర్లందరూ సమిష్టిగా తంబి చిత్రపటం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువులు రెవ.ఫాదర్ గోపు అభిలాష్, సహాయగురువులు, ఇతర గురువులు, మఠవాసులు, కన్యాస్త్రీలు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఏపీ టూ వీలర్స్ అసోసియేషన్ నాయకులు

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ఏపీ టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాయనేని ధర్మారావు

ఉయ్యూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని మెకానిజంలో ఆధునీకత సాధించి సులభతరం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాయనేని ధర్మారావు అన్నారు. ఉయ్యూరు టూవీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం పురస్కరించుకుని స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మారావు మాట్లాడుతూ , టూవీలర్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న మెకానిక్ వృత్తి భద్రత, సంక్షేమానికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలని కోరారు. అసోసి యేషన్ వ్యవస్థాపకుడు ఆనీఫ్‌అలీ, రాష్ట్ర సలహాదారు ఫిరోజ్‌బేగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నబిగోరి, కోశాధికారి జుబేర్, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎండీ అక్బర్ బాషా, ఉయ్యూరు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. జగన్నాథం, కార్యదర్శి ఇబ్రహీం, జిల్లా నుంచి మెకానిక్‌లు పాల్గొన్నారు.

నూజివీడు నియోజకవర్గంపై నిరాధార ఆరోపణలు తగదు

ఎమ్మెల్యే యర్లగడ్డ వెంకట్రావు ప్రెస్‌మీట్‌పై టీడీపీ నేతల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్ రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని గన్నవరం ఎమ్మెల్యే యర్లగడ్డ వెంకట్రావు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడటం సబబుగా లేదని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకులు పొట్లూరి సత్యన్నారాయణ, గోగినేని మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు రాష్ట్ర మంత్రి పార్థసారథి కృషి చేస్తున్నారన్నారు. ఎన్ని ముఖ్య కార్యక్రమాలున్నా నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రిపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసీపీ అక్రమాలు, అవినీతిని అణచివేసేందుకు నూజివీడు టీడీపీ సంసిద్ధంగా ఉందని తెలిపారు. గన్నవరం నియోజకవర్గానికి చెందిన సాంబయ్య అనే వైసీపీకి చెందిన వ్యక్తి గొల్లపల్లి, వేంపాడులో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన వెనుక ఉన్నారని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని అవసరమైతే చూపిస్తామన్నారు. పేర్లు మార్చిన లారీలు మాజీ మంత్రి కొడాలి నాని వేనని, మాజీ ఎమ్మెల్యే వంశీ కూడా నూజివీడు నియోజకవర్గంలో అక్రమాలు చేశాడని పొట్లూరి సత్యన్నారాయణ అన్నారు. ప్రస్తుతం ఎలాంటి అక్రమ మైనింగ్ జరగట్లేదని, అపోహలు వీడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘు, తుమ్మల ఆది, పొట్లూరి శాంతి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఉయ్యూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీ డీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ సంస్థలు 2025-2026 సంవత్సరానికి ప్రతి పాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వ్యక్తిగతంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 7నుంచి 8వ తేదీ వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. ఉదయం 10-30 నుంచి 1 గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 నుంచి 4-30 గంటలవరకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని తెలిపారు. వినియోగదారులు ఉయ్యూరు ఈ ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి 4-30 గంటలవరకు హాజరుకావచ్చని తెలిపారు.

డయల్ యువర్ ఈఈ నేడు

ఉయ్యూరు డివిజన్ పరిధిలో ఉయ్యూరు, తోట్లవల్లూరు, చల్లపల్లి, ఘంటసాల, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు డయల్ యువర్ ఈఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. 08676233718 నంబరుకు ఫోన్‌చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు.

విద్యుత్ ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్‌కు సహకరించాలి

పీక్‌లోడ్ అవర్స్‌లో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ కృష్ణనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల 6 నుంచి 8 వరకు గుడివాడ 160 ఎంవీఏ పీటీఆర్ మెయింటెనెన్స్ చేస్తున్న సందర్భంగా ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

హైందవ శంఖారావానికి భారీగా తరలిన భక్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేసరపల్లిలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం సభకు ప్రజలు, భక్తులు భారీగా తరలివెళ్లారు. బాపులపాడు మండలంలోని బండారుగూడెం, బొమ్ములూరు, కానుమోలు, కొత్తపల్లి, కాకులపాడు, మల్లవల్లి తదితర గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 బస్సులు ఏర్పాటు చేసి ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు, శ్రీహరి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోడూరుపాడు, వీరవల్లి, అంపాపురం, ఏ.సీతా రాంపురం తదితర గ్రామాలకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ 110 బైక్‌లతో చందు శ్రీనివాసరావు పర్యవేక్షణలో ర్యాలీగా తరలివెళ్లారు.

కంకిపాడు : గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారవంకు కంకిపాడు మండలం నుంచి హైందవ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఉప్పలూరు రైల్వే స్టేషన్‌కు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 9 ప్రత్యేక రైళ్లలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై డి. సందీప్, ఎస్సై - 2 తాతాచార్యులు తగు చర్యలు చేపట్టారు.

ఉయ్యూరు : కేసరపల్లిలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావానికి ఉయ్యూరు నుంచి ప్రజలు పెద్దయెత్తున తరలి వెళ్లారు. స్థానిక వీహెచ్‌పీ నాయకులు తెల్లాకుల శివనాగరాజు, సుధాకర్, పునీత్, నాగరాజు, దీవి చిన్మయ, వణుకూరు శివ, ఉకోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరమ్మ ఆలయం వద్దనుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు.

గన్నవరం : మండలంలోని కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావం బహిరంగ సభలో భక్తులు సందడి చేశారు. పక్కనే ఉన్న ఎస్‌ఎల్‌వి మెడోస్ ప్రాంగణంలో స్వామీజీలకు వసతి కల్పించారు. ఆ ప్రాంగణంలో ఉన్న వినాయకుని ఆలయం వద్దకు స్వామీజీలు వచ్చారు. వారితో ఫొటోలు దిగేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు.



కోడూరుపాడు, వీరవల్లి నుంచి బైక్ ర్యాలీ



ఉప్పలూరు రైల్వేస్టేషన్ నుంచి సభా ప్రాంగణానికి తరలి వెళ్తున్న హిందువులు



స్వామీజీలతో భక్తులు



చిన్నారికి ఎల్వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పెనమలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చిన్నారి కొడాలి నిత్య ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండడంతో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఐదున్నరలక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ చెక్కు మంజూరయింది. ఆదివారం చిన్నారి కుటుంబ సభ్యులకు చెక్కును స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, బొంగరాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

పోరంకి అనుమోలు ఆదరణ ట్రస్టు ఉచిత వైద్య శిబిరానికి ఆదివారం విశేష ఆదరణ లభించింది. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన వైద్య శిబిరానికి వందల సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. ప్రజలకు స్థానిక క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

డ్రింకర్ సాయి చిత్ర యూనిట్‌కు అభినందన

హనుమాన్‌జంక్షన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమేతంగా చూసే విధంగా మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలని యువతకు మంచి సందేశాన్ని డ్రింకర్ సాయి సినిమా ద్వారా అందించిన చిత్ర యూనిట్ సభ్యులకు జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు అభినందనలు తెలిపారు. ఆదివారం ఆయన తన కుటుంబ సభ్యులు, జనసేన కార్యకర్తలతో కలిసి స్థానిక కెఎస్ టాకీస్‌లో విజయవంతంగా ప్రదర్శిస్తున్న డ్రింకర్‌సాయి చిత్రాన్ని చూశారు. ప్రేక్షకాదరణ పొందే విధంగా చిత్రాన్ని రూపొందిం చిన దర్శక నిర్మాతలను అభినందించారు. చిత్ర కథానాయకుడు ధర్మ మహేష్ నటన కూడా చాలా బాగుందని యువతకు మంచి సందే శాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. యువత తప్పని సరిగా చూడాల్సిన సినిమా అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అహమ్మద్, వీరమహిళలు జయరాణి పాల్గొన్నారు.

క్షణికావేశంలో యువకుడు ఆత్మహత్య

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి శివారు వివిఎస్‌పురం కాలనీలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీ రెండవ రోడ్డులో ఉంటున్న నందిపాముల రాంబాబు (37) గత రెండు రోజుల నుంచి పూటుగా మద్యం సేవిస్తున్నాడు. రోజు ఎందుకు తాగుతున్నావని గొడవ పడటంతో క్షణికావేశంకు లోనై ఆదివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవటంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఇంటి యజమాని మద్యానికి బానిసైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం.. అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్ళు అనుభవించారు చెన్నైకి చెందిన **భాను సురేష్‌బాబు**. కష్టనష్టాలు భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా అనుభవించకూడదనే ఆలోచనతో... డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి... వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

> 'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం


మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటువైపు వెళ్లరు.

ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

● డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు





17 చుక్కలు, 17 వరుసలు


జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!

తేనె



- ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేక్‌లు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.



బెల్లం

- దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.

ఖర్జూరాలు



- కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.



మచిలీపట్నం హిందూ హైస్కూల్ ఆవరణలో ఉత్సాహంగా రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు



మొదటి మూడు బహుమతుల విజేతలు బి.అరుణ, ఎస్.స్వప్నసుందరి, బి.రమ్యశ్రీలతో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు

సంస్కృతికి దర్పణం ముత్యాల ముగ్గులు

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చొరవకు కొనకళ్ల అభినందన

▸▸ ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

మచిలీపట్నంటౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తూ ప్రతి ఏటా 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించడం ముదావహమని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్ ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఆదివారం హిందూ కళాశాల హైస్కూల్ ఆవరణలో అంగరంగవైభవంగా జరిగాయి. కొల్లు ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ముగ్గుల పోటీలకు 50 మంది మహిళలు, యువతులు, బాలికలు హాజరై ముత్యాల ముగ్గులను రమణీయంగా తీర్చిదిద్దారు. ముగ్గులు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించాయి. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, తెలుగు వారి సంస్కృతిలో భాగమైన సంక్రాంతి రంగవల్లులను తీర్చిదిద్దడంలో మన మహిళల సృజన అమోఘమన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బి.అరుణ(ప్రథమ), ఎస్.స్వప్నసుందరి(ద్వితీయ), బి.రమ్యశ్రీ (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. పది మందికి రూ.500 చొప్పున కన్సొలేషన్ బహుమతులును అందజేశారు. టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము తొలి ముగ్గురు విజేతలకు ప్రోత్సాహక బహుమతిగా ఇమిటేషన్ జ్యూయలరీ అందజేసి సత్కరించారు. రామలక్ష్మణ క్లాత్ స్టోర్ నిర్వాహకులు బద్రీనాథ్ పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ చీరలను అందజేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పి.శ్రీరామ్, టీడీపీ కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, మరకాని సమతా కీర్తి, తెలుగుమహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మ విజేతలకు బహుమతులను అందజేశారు. న్యాయనిర్ణేతలుగా శ్రీకాకుళపు రేణుకారాణి, జొన్నలగడ్డ మాధవి, శివలెంక ఉషాకిరణ్ వ్యవహరించారు. మాస్టర్ జోగి శంకర్ శిష్య బృందం కోలాటం, గంగిరెద్దుల విన్యాసాలు, చిలకలపూడి పాండురంగ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థుల జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎన్ఆర్ఐ వీర్నాల ఫౌండేషన్ ప్రతినిధి మానస ఈ ముగ్గుల పోటీలకు విచ్చేసి మొదటి బహుమతి విజేత బి.అరుణకు రూ.2వేలు ప్రోత్సాహకంగా అందజేసింది.





ముగ్గుల పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా డూడూ బసవన్నలు, చిత్రంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, ఎన్నారై మానస



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పోటీల్లో పాల్గొనడం గొప్ప అదృష్టం : ప్రథమ విజేత బి.అరుణ
: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఒక అదృష్టంగా భావిస్తున్నా. అందరి మన్ననలు పొందిన ముగ్గుకు ప్రథమ బహుమతి రావడం ఎంతో సంతోషంగా ఉంది.

మహిళలకు ప్రత్యేక సందేశం : ద్వితీయ విజేత ఎస్.స్వప్నసుందరి
మహిళలను రక్షించాలని, మొక్కలు పెంచాలన్న సందేశంతో ముగ్గును గీశాను. తోటి మహిళలు వేసిన ప్రతి ముగ్గు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. సన్నాయి మేళం.. సంక్రాంతి పండుగ విశిష్టత తెలియజెప్పేలా ముగ్గు వేశా. పోటీలో పాల్గొన్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.

పరవశింపజేసిన ముగ్గులు : తృతీయ విజేత బి.రమ్యశ్రీ
'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీల్లో ప్రతిసారి పాల్గొంటున్నా. ఈసారి తృతీయ బహుమతి వచ్చింది. సంక్రాంతికి ముందే సందడి వాతావరణం తెచ్చిన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ధన్యవాదాలు.

- మచిలీపట్నం టౌన్



రేపు అంగలూరు డైట్ కళాశాలలో రంగోత్సవ్

గుడ్లవల్లేరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అంగలూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్‌కళాశాల)లో మంగళవారం జిల్లా స్థాయి రంగోత్సవ్ 2024-25 నిర్వహించనున్నామని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జె.మోహినీకుమారి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్, మునిసిపల్, ఎయిడెడ్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఎనిమిది కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. క్విజ్, ముగ్గుల పోటీలు, చిత్రలేఖనం, చేతిరాత, స్లోగన్ రైటింగ్, జానపద నృత్యం, రోల్ ప్లే, డిజిటల్ కొలేజ్ అంశాలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని మోహినీకుమారి తెలిపారు. రంగోత్సవ్‌కు నోడల్ అధికారిగా డైట్ కళాశాల అధ్యాపకురాలు ఎస్.జయశ్రీ వ్యవహరిస్తున్నారని వివరాలకు 83282 14217కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

పనిచేసే ప్రభుత్వమిది

● రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

తోట్లవల్లూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం గుంతలతో వదిలేసిన రోడ్లను కూటమి ప్రభుత్వం బాగుచేస్తోందని, ఇది ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. వల్లూరుపాలెం నుంచి కంకిపాడు లాకుల వరకు 6.63 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.40 లక్షలతో మరమ్మతులకు ఆదివారం చినపులిపాక వద్ద ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బొడ్డపాడులో రూ.1.65 లక్షలతో రచ్చబండ వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తోట్లవల్లూరు మండలంలో రూ.1.20 కోట్లతో, నియోజకవర్గంలో రూ.6 కోట్లతో రహదారుల బాగుజేతకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

ఉపాధి హామీ నిధులు రూ.27 కోట్లతో 462 రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికి 80 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, సర్పంచ్ మూడే శివశంకర్, ఆర్‌అండ్‌బీ ఏఈ మల్లికార్జున్, కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.



చినపులిపాక వద్ద రోడ్డు మరమ్మతుల పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

వెంకటేశ్వరరావు దంపతులకు సత్కారం

ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన లంక వెంకటేశ్వరరావు అభినందనసభ ఆదివారం గరికపర్రు సాయికల్యాణ మండపంలో జరిగింది. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, సర్పంచ్ మూడే శివశంకర్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు వెంకటేశ్వరరావు దంపతులను పూలమాలతో శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు.

రుణ విముక్తులను చేయాలి

● టిడ్కో గృహాల లబ్ధిదారులు

గుడివాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీ మేరకు టిడ్కో గృహాల లబ్ధిదారులను రుణవిముక్తులను చేయాలని, లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ, ఉపాధ్యక్షురాలు నూరున్నీసా హెచ్చరించారు. ఆదివారం రాత్రి మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. టిడ్కో రుణాలను మాఫీ చేయిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారని, ఇప్పుడు మాట్లాడకపోతే ఎలా అని బసవ అరుణ ప్రశ్నించారు. వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో లబ్ధిదారులందరిని ఏకం చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బ్యాంకర్ల నుంచి బెదిరింపులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీ4, బీ8, బీ21, సీ151 బ్లాక్‌ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, లబ్ధిదారులు

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

పమిడిముక్కల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డుదాటుతున్న వృద్ధుడిని ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై గోపువానిపాలెం క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగింది. యలమర్రుకు చెందిన మూల్పూరి శివరామప్రసాద్(69) రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పమిడిముక్కల పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండో అంతస్తు నుంచి పడి తాపీమేస్త్రి మృతి

గుడివాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనంపై నుంచి పడి తాపీమేస్త్రీ మృతి చెందాడు. ఈ ఘటన పెద ఎరుకపాడులో ఆదివారం జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక టిడ్కో కాలనీలో నివాసముంటున్న తాపీ మేస్త్రీ పసుపులేటి నరేష్ ఆదివారం పెద ఎరుకపాడులో తాపీ పనికి వచ్చాడు. రెండో అంతస్తులో పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి : సీపీఎం

గుడివాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలో ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకుడు ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకూ అత్యాచారాలు, మహిళలు, బాలికలపై వేధింపులు పెరిగిపోయాయన్నారు. వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఐద్వా కార్యదర్శి పి.రజిని, ఎస్ఎఫ్ఐ నాయకుడు సమీర్ పాల్గొన్నారు.

గుడివాడలో వైద్యశిబిరం

గుడివాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ది గుడివాడ మహిళ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.దీవెన, వి.ప్రతిమలు మాట్లాడారు. స్పెక్ట్రం డయాగ్నోస్టిక్ సహకారంతో బీపీ, మధుమేహం తదితర వ్యాధులకు రక్తపరీక్షలు నిర్వహించామన్నారు. చిన్నారులకు రక్తపరీక్షలు చేయించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు.

గుడివాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయవాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని 220కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతులు కారణంగా సోమవారం నుంచి ఎనిమిదో తేదీ వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ కోటేశ్వరరావు తెలిపారు. పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోట సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

వైభవంగా సాయినాథుని ధ్యానమందిర వార్షికోత్సవం

తోట్లవల్లూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడులో శ్రీసాయినాథుని ధ్యాన మందిరం 25వ వార్షికోత్సవ కార్యక్రమాలను ఆదివారం సాయిపథం షిరిడి వారి పర్యవేక్షణలో వైభవోపేతంగా నిర్వహించారు. బొడ్డపాడు, చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు. వెయ్యిమంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఎడ్లబండిపై సాయిబాబా, గురూజీల చిత్రపటాలను ఊరేగించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

10న ముగ్గుల పోటీలు

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు జరుగుతాయని, 8వ తేదీ లోపు 98850-68099 నెంబర్‌కు సంప్రదించి ఎంట్రీలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్లింపు

హనుమాన్‌జంక్షన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేసరపల్లిలో హైందవ శంఖారావం బహిరంగ సభ జరిగిన సందర్భంగా హనుమాన్‌జంక్షన్‌లో గన్నవరం మీదుగా రద్దీ పడకుండా ఆదివారం వాహనాలను మళ్లించారు. ట్రాఫిక్ నిర్వహణకు ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 170 మంది పోలీస్ సిబ్బందని జంక్షన్‌లో బందో బస్తుకు కేటాయించారు. హైదరాబాద్ వెళ్లే వాహనాలను నూజివీడు, చెన్నై వెళ్లే వాహనాలను గుడివాడ మీదుగా మళ్లించారు.



ట్రాఫిక్ మళ్లిస్తున్న పోలీసులు



భోగి మంటను వెలిగిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

గుడివాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్ వద్ద రోటరీ సంక్రాంతి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ ఫ్రెండ్‌షిప్ అండ్ ఫెలోషిప్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అజయ్‌రాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, భోగిమంట, చిన్నారులకు భోగి పండ్లు, మహిళలకు గాజులు, కోడిపుంజుల కోలాహలం, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కథాకాలక్షేపం, ఎద్దుల బండిపై చిన్నారులు, మహిళల విహారం, పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. క్లబ్ కౌన్సిలర్ జి.బాబుశ్రీకర్, క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్.రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షులు, ఇన్నర్‌వీల్ సభ్యులు పాల్గొన్నారు.

కొర్నేలియస్‌కు సత్కారం

గుడివాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1944లో గుడివాడకు వచ్చారని, అప్పుడు విద్యార్థిగా ఉన్న పులవర్తి కొర్నేలియస్ అంబేడ్కర్‌ను కలిశారని, ఆయన చాలా అదృష్టవంతుడని విశ్రాంత ఉపాధ్యాయులు బండి గోవర్ధనరావు పేర్కొన్నారు. ఆదివారం వర్ల వీధిలోని కొర్నేలియస్ స్వగృహంలో ఆయనను దళిత సంఘాల నాయకులతో కలిసి సత్కరించారు. అప్పటి ఆదిమాంధ్ర సంఘ సభ్యులతో గౌరీశంకరపురంలోని బాలబాలికల వసతిగృహం నిర్మాణానికి అంబేడ్కర్ శంకుస్థాపన చేశారన్నారు. నాడు 5వ తరగతి విద్యార్థిగా ఉన్న కొర్నేలియస్ అంబేడ్కర్‌తో కలిసి దిగిన గ్రూపు ఫొటో ఇప్పటికీ దాచుకున్నారన్నారు. నాయకులు చింతా సువర్ణరాజు, దాసు మోహనరావు, చొప్పట జోషి, రావూరి చిన్న, సీటీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఏపీ టూ వీలర్స్ అసోసియేషన్ నాయకులు

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ఏపీ టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాయనేని ధర్మారావు

ఉయ్యూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని మెకానిజంలో ఆధునీకత సాధించి సులభతరం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాయనేని ధర్మారావు అన్నారు. ఉయ్యూరు టూవీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం పురస్కరించుకుని స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మారావు మాట్లాడుతూ , టూవీలర్ మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలన్నారు. మెకానిక్ వృత్తి భద్రత, సంక్షేమానికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలని కోరారు.



గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పిస్తున్న ఆర్మీ సిబ్బంది

సీఆర్పీఎఫ్ ఏఎస్సై రామకృష్ణకు ఘనవీడ్కోలు

● ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

గుడివాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : అరుణాచల్‌ప్రదేశ్‌లో విధి నిర్వహణలో గుండెపోటుతో అసువులు బాసిన సీఆర్పీఎఫ్ ఏఎస్సై రామకృష్ణ భౌతికకాయానికి ఆదివారం బాపూజీనగర్ శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి, ఘనవీడ్కోలు పలికారు. తొలుత ఆర్మీ సిబ్బంది గాల్లోకి కాల్పులు జరిపి వందన సమర్పణ గావించారు. జనసేన పార్టీ తరఫున నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, పవన్ తదితరులు రామకృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించారు.



హైందవ శంఖారావానికి తరలివెళ్తున్న హిందువులు

హైందవ శంఖారావానికి తరలిన హిందువులు

పెదపారుపూడి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మండలం కేసరపల్లిలో హైందవ శంఖారావం భారీగా బహిరంగసభకు హిందువులు భారీ సంఖ్యలో బైక్‌లు, ఇతర వాహనాల్లో తరలివెళ్లారు. గుడివాడ నుంచి బయలుదేరి పెదపారుపూడి దగ్గర మరి కొంతమంది కలుపుకొని భారీగా సభకు తరలివెళ్లారు.

క్షణికావేశంలో యువకుడు ఆత్మహత్య

గన్నవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి శివారు వీఎన్‌పురం కాలనీలో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీ రెండవ రోడ్డులో ఉంటున్న నందిపాముల రాంబాబు (37) గత రెండు రోజుల నుంచి పూటుగా మద్యం సేవిస్తున్నాడు. రోజు ఎందుకు తాగుతున్నావని గొడవ పడటంతో క్షణికావేశంకు లోనై ఆదివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవటంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు గణపతి సచ్చిదానంద స్వామి ఆగమనం

మచిలీపట్నం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మైసూరు గణపతి సచ్చిదానంద స్వామి సోమవారం నుంచి రెండు రోజులపాటు మచిలీపట్నంలో భక్తులకు అనుగ్రహబాషణం అందిస్తారు. సోమవారం బుట్టాయిపేట దత్తాశ్రమంలో సాయంత్రం అభిబాషణం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అత్రిదత్తరాగసాగర కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో స్వామిజీ ఆశీస్సులు పొందేందుకు భక్తులు హాజరు కావాలని నల్లారి బుద్ధేశ్వరరావు కోరారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రుత్విక్‌కు బంగారు పతకం

గుడివాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గత డిసెంబరు 22, 23 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన 38వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పవర్‌లిఫ్టింగ్ విభాగంలో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి చరణ్ రుత్విక్ 66కేజీల శరీర బరువు విభాగంలో 265కేజీల బరువునెత్తి బంగారు పతకాన్ని సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పతక గ్రహీతను అభినందించారు. బంగారు పతకం సాధించిన రుత్విక్ త్వరలో నిర్వహించే జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. పతక గ్రహీతను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.



రుత్విక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం

పెదపారుపూడి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంట్రప్రగడ లో పెద్దమాలపల్లికి చెందిన దగాని లక్ష్మీరాజ్యం రేకుల షెడ్డు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 7 గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిందని, దీంతో ఇల్లంతా దగ్ధమైందని తెలిపారు. రూ.మూడు లక్షల విలువైన బంగారం, రూ.50 వేల నగదు, ఇంట్లో ఉన్న సామగ్రి, మంచం, బీరువా, ఫ్రిడ్జ్ కాలిపోయాయన్నారు. గ్యాస్ సిలిండర్ పేలిన ధాటికి రేకులు మొత్తం చిన్నాభిన్నం అయ్యాయన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



లయన్స్ సేవా కార్యక్రమాలు

గుడ్లవల్లేరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. బీసీ బాలికల కళాశాల వసతిగృహంలో 88 మంది విద్యార్థినులకు ఉచిత నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. 54 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారితో ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని క్లబ్ అధ్యక్షురాలు శశికళ తెలిపారు. నిరుపేదలైన వృద్ధులకు గ్రామ ప్రముఖులు వల్లభనేని వీరబద్రరావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు వల్లభనేని రామకృష్ణ(యుఎస్ఏ) అన్నదానం నిర్వహించారు. వైపీసీ ప్రసాద్, మేరుగు పెరుమాళ్లు, వల్లభనేని రామకృష్ణ, పొట్లూరి రవికుమార్, గుమ్మడి రామకృష్ణ, సూరపనేని పరంధామయ్య, జంగం మోహనరావు, చాపరాల బాలాజీ, మూల్పూరి సుధాకర్ పాల్గొన్నారు.

● నేడు గుడ్లవల్లేరు లయన్స్ సేవాభవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో అపరాలసాగు, సేంద్రియ వ్యవసాయంలో మెళకువలపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించనున్నారు.

లైవ్ సర్టిఫికెట్ల సమర్పణకు ప్రత్యేక కౌంటర్లు

గుడ్లవల్లేరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : సర్వీసు, ఫ్యామిలీ పింఛనుదారులకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. ఏటా లైవ్ సర్టిఫికెట్లు ఖజానా కార్యాలయాల్లో సమర్పించాలి. వృద్ధాప్యంలో ఉన్న వారిని ఇబ్బంది పెట్టకూడదని గుడివాడ ట్రెజరీ సిబ్బంది గుడ్లవల్లేరు, కౌతవరంలో రెండ్రోజులపాటు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈనెల 6వ తేదీన ఒకసారి, 20వ తేదీన మరోసారి పింఛనుదారుల నుంచి లైవ్ సర్టిఫికెట్లు తీసుకుంటారు. గుడ్లవల్లేరు, కౌతవరం పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రత్యేక కౌంటర్లలో తమ లైవ్ సర్టిఫికెట్లు ఇవ్వవచ్చు. ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం జిరాక్సు కాపీలు, ఒరిజినల్ పెన్షన్ పుస్తకం, ఆధార్‌తో లింకైన ఫోన్ నంబరుతో రావాలని ట్రెజరీ సిబ్బంది సూచించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.525

నేడు పైడమ్మ ఆలయంలో భారీ అన్న సమారాధన

పెడన, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతర ఉత్సవాలు ముగియడంతో పైడమ్మ దేవస్థానం ఆవరణలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని ఈవో టి.వి.వి.మోహనరావు తెలిపారు. 20 వేల నుంచి 25 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేశామని, అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. దేవస్థానం ఆవరణలో 8 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 8 కౌంటర్ల ద్వారా భక్తులకు అమ్మవారి అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

రంగవల్లులు..సంక్రాంతి సోయగాలు



హిందూ హైస్కూల్ ఆవరణలో ముగ్గులేస్తున్న మహిళలు

మచిలీపట్నం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆదివారం హిందూ హైస్కూల్ ఆవరణలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించింది. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగొసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్), కొల్లు ఫౌండేషన్ సహకారం అందించాయి. మచిలీపట్నం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మహిళల వేలికొనల నుంచి జాలువారిన రంగురంగుల ముగ్గుల్లో ఉంచిన గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, చెరకుగడలు, గాలిపటాలు, లక్కపిడతలు, నవధాన్యాలు, కొండపల్లి బొమ్మలు సంక్రాంతి సోయగాలను సంతరించాయి. కొందరు మహిళలు రైతే రాజు అంటూ రైతుల గొప్పతన్నాన్ని వివరిస్తూ ముగ్గులేశారు. సేవ్ ది గర్ల్ అంటూ బాలికల పరిరక్షణపై, సేవ్ ది ట్రీస్ అంటూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఫేస్‌బుక్‌లు, సెల్‌ఫోన్లకు బానిస కావద్దని కొందరు మహిళలు ముగ్గుల్లో సందేశమిచ్చారు. మరికొందరు ఆంధ్రజ్యోతి అక్షరాయుధాలను అందిస్తుందని, నిజానికి ప్రతిరూపంగా వార్తలను అందిస్తుందని తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్, పింఛన్ల పెంపుదల, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలను ముగ్గుల్లో ప్రస్తావించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి



రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను ఆహ్వానిస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి రమేశ్

అవనిగడ్డ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యేను బీసీ సంక్షేమ జిల్లా అధికారి జి.రమేశ్ కలిసి మోపిదేవిలోని బీసీ ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. రాష్ట్రవ్యాప్తంగా 104 వసతిగృహాల్లో ప్రభుత్వం రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని, ఉమ్మడి కృష్ణాజిల్లాలో 8 కేంద్రాలు ఏర్పాటు కాగా, కృష్ణాజిల్లాలో మోపిదేవి, గన్నవరం, పోలాటితిప్ప, కూచిపూడి, అవనిగడ్డలోని వసతిగృహాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లీష్, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో ఈ సెంటర్ల ద్వారా శిక్షణ ఇస్తారని, ఇది ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయమని బుద్ధప్రసాద్ అన్నారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ దివ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు లంకేశ్వరరావు, భాస్కరరావు, సురేష్, నాగార్జున, రాజు, విష్ణు పాల్గొన్నారు.

40 వేల సభ్యత్వాలు లక్ష్యం

● టీడీపీ నేత, పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్

అవనిగడ్డ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గంలో 40 వేల టీడీపీ సభ్యత్వాలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, లక్ష్యాన్ని చేరుకునేందుకు సహకరించాలని కార్యకర్తలు, నాయకులకు ఆ పార్టీ నేత, పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేస్తోందని, దీని కారణంగా ప్రజల్లో పార్టీ పట్ల సానుకూలత పెరిగిందని తెలిపారు. దీంతో ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే 32 వేలకుపైగా సభ్యత్వాలు పూర్తయ్యాయని, కొన్ని సాంకేతిక కారణాలతో సభ్యత్వ నమోదు ఆలస్యమవడంతో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అదనంగా సిబ్బందిని నియమించి కార్యక్రమాన్ని వేగవంతం చేశామని, వారంలో 40 వేల సభ్యత్వాలు పూర్తి చేస్తామని తెలిపారు.

బైక్‌ను తగలబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు



పెడన పాత కూరగాయల మార్కెట్‌వీధిలో దగ్ధమైన బైక్

పెడన, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మోటారు బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టిన సంఘటన పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ వీధి(17వ వార్డు)లో ఆదివారం జరిగింది. ఐడీఎఫ్‌సీ బ్యాంకు లోన్ రికవరీ బృందంలోని సభ్యులు పాత కూరగాయల మార్కెట్ వీధిలోని ఒక భవనంలో అద్దెకు ఉంటున్నారు. తమ భవనం ఎదుట నిలిపి ఉంచిన ప్యాషన్ ప్రో మోటారు బైక్‌పై ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించి పారిపోయారు. బైక్ పూర్తిగా కాలిపోయింది. బైక్‌ను ఎవరు తగులబెట్టారు, ఎందుకు తగులబెట్టారన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం

నగర చైర్మన్‌గా వేముల సూరిబాబు

మచిలీపట్నం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కళాకారుల సంక్షేమ సంఘం నగర చైర్మన్‌గా వేముల సూరిబాబు వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బెల్లంకొండ ఏడుకొండలు, న్యాయ సలహాదారుడిగా లంకిశెట్టి బాలాజీ, ముఖ్యసలహాదారులుగా పరింకాయల విజయచంద్రకుమార్, పుప్పాల వీరాంజనేయులు, గౌరవసలహారుదాడిగా గూడవల్లి నాగరాము, వైస్‌చైర్మన్‌గా ఈదా నాగేంద్రం, వైస్‌చైర్మన్లుగా రాజులపాటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా తూమాటి రాజేశ్వరరావు, కార్యదర్శిగా ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు, కోశాధికారిగా పోతన వీరవెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లుగా సూదగాని వెంకట రంగారావు, గాజుల కృష్ణమూర్తినాయుడు, పామర్తి సత్తిబాబు, భట్రాజు అర్జునరావులు ఎన్నికయ్యారు. రంగస్థల కళాకారుల సంక్షేమ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు కళాభిమానులు, కళాకారులు సహకరించాలని వేముల సూరిబాబు కోరారు.

టైలర్స్ అసోసియేషన్ నగర

అధ్యక్షుడిగా చండిక రామాంజనేయులు

మచిలీపట్నం టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : టైలర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడుగా చండిక రామాంజనేయులు ఆదివారం ఎన్నికయ్యారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో అంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ సలాం, కోశాధికారిగా ముత్యాలపల్లి సత్యనారాయణతో పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఇలియాస్ పాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



హైందవ శంఖారావం సభకు వెళుతున్న వాహనానికి బంటుమిల్లిలో జెండా ఊపుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్





చల్లపల్లి, మోపిదేవి నుంచి భారీగా తరలివెళుతున్న హిందువులు

శంఖారావానికి తరలిన హిందువులు

అవనిగడ్డ/నాగాయలంక/మోపిదేవి/చల్లపల్లి/పెడన/పెడన రూరల్/బంటుమిల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కేసరపల్లిలో నిర్వహించిన హైందవ శంఖారావానికి అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల నుంచి హిందువులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి మూడు మండలాల నుంచి వచ్చిన వారి వాహనాలకు ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు కోలా శ్రీమన్నారాయణ, తుంగల వెంకట గిరి, జి.వి.నగరాయులు, భోగాది చంద్రశేఖర్ తదితరులు జెండా ఊపి పంపారు. నాగాయలంకలో ఆక్వా పారిశ్రామికవేత్త సీఎల్ రావు రొయ్యల కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన వాహనాల్లో హిందువులు నినాదాలు చేస్తూ సభకు తరలివెళ్లారు. మోపిదేవి మండలంలోని పెదకళ్లేపల్లి, వెంకటాపురం, కోసూరువారిపాలెం, పెదప్రోలు, మోపిదేవి గ్రామాల నుంచి 8 బస్సుల్లో హైందవ శంఖారావం సభకు హిందువులు తరలివెళ్లారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు అరజా ఏడుకొండలు, ఇస్కాన్ సీనియర్ సభ్యుడు గుమ్మడి నరసింహారావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. చల్లపల్లి ప్రఖండ ఏరియాలోని అన్ని ప్రాంతాల నుంచి 11 బస్సులు ఏర్పాటుచేశారు. 500 మందికి పైగా సభకు తరలివెళ్లారు. చల్లపల్లి ఆర్టీసీ బస్టాండ్ సెంటరులో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీగా మహాసభకు తరలివెళ్లారు. పెడన మండలం పెనుమల్లి నుంచి బస్సులు బయలుదేరాయి. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేశ్ జెండా ఊపి ప్రారంభించారు. చెన్నూరు, చేవేంద్ర, ఉరివి, పుల్లపాడు, చోడవరం, పెనుమల్లి, నందిగామ, నడుపూరు, బల్లిపర్రు, మడక, నందమూరు, జింజేరు, కాకర్లమూడి గ్రామాలను కలుపుతూ బస్సులు ఏర్పాటు చేశారు. పెడనలో హిందూ బంధువుల ఐక్యవేదిక నాయకుడు కోటి పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద బస్సు ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అందులో హైందవ శంఖారావం సభకు వెళ్లారు. బంటుమిల్లి పరిసర ప్రాంతాల నుంచి సభకు వెళుతున్న బస్సులకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల నుంచి 23 బస్సులు బయలుదేరాయి.

సనాతన ధర్మాన్ని కాపాడాలి

మచిలీపట్నం టౌన్: సనాతన ధర్మాన్ని కాపాడాలని, దేవాలయాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని, దేవాలయాల ఆస్తులు, భూములు పరిరక్షించాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని హైందవ శంఖారావానికి తరలివెళ్లిన హిందువులు డిమాండ్ చేశారు. మచిలీపట్నం నుంచి పెద్ద సంఖ్యలో సభకు తరలివెళ్లారు. బీజేపీ నాయకుడు పంతం వెంకట గజేంద్రరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న బీజేపీ నేత పంతం గజేంద్ర తదితరులు

పేదల నాయకుడు వీఎం రంగా

● ముల్లపర్రులో రంగా విగ్రహావిష్కరణ సభలో ఎంపీ బాలశౌరి



ముల్లపర్రులో రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ బాలశౌరి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, బూరగడ్డ వేదవ్యాస్, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా నిరుపేదల పాలిట పెన్నిధి అని, ఆయన ఆశయాల సాధనకు అందరూ పనిచేయాలని ఎంపీ బాలశౌరి పిలుపునిచ్చారు. వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ ఆదివారం ముల్లపర్రు గ్రామంలో జరిగింది. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, టీడీపీ నేత కొనకళ్ల బుల్లయ్య, జనసేన నాయకుడు పంచకర్ల సురేష్‌తో కలిసి ఆయన విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. రంగా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

పంచాయతీ భవనం ప్రారంభం

బంటుమిల్లి: మల్లంపూడి గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ ప్రారంభించారు. సర్పంచ్ శ్రీనివాసరావు, పంచకర్ల సురేష్, కూనపరెడ్డి వీరబాబు, బొర్రా కాశీ, రేవు గోపాలకృష్ణ, యిల్లారి లీలాకృష్ణ, జడ్పీటీసీ మలిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాలకాయితిప్ప మెరైన్ ఎస్సైగా

టి.పూర్ణమాధురి



కోడూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాలకాయితిప్ప మెరైన్ ఎస్సైగా టి.పూర్ణమాధురి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహిస్తున్న ఏకే జిలానీ పదవీవిరమణ కోసం ఏలూరు రేంజ్‌కి రిపోర్ట్ చేశారు. బంటుమిల్లి శివారు వర్లగొంది తిప్ప ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న పూర్ణమాధురి పాలకాయితిప్పకు బదిలీపై వచ్చారు. ఎస్సైకు మెరైన్ సిబ్బంది అభినందనలు తెలిపారు. పూర్ణమాధురి కోడూరు ఎస్సై కె.చాణక్య సతీమణి. ఒకే మండలంలో భార్యాభర్తలు విధులు నిర్వహించే అవకాశం రావడం విశేషం.

మెరైన్ పోలీసుల సూచనలు తప్పక పాటించాలి

● పర్యాటకులతో ఎస్సై పూర్ణమాధురి

హంసలదీవి బీచ్‌కు వచ్చే పర్యాటకులు మెరైన్ పోలీసుల సూచనలు తప్పక పాటించాలని మెరైన్ ఎస్సై పూర్ణమాధురి సూచించారు. ఆదివారం హంసలదీవి సముద్ర తీరప్రాంతానికి వివిధ ప్రాంతాల నుంచి విహారయాత్రకు వచ్చిన పర్యాటకులకు ఆమె పలు సూచనలు చేశారు. సముద్రంలో లోతైన ప్రాంతాలు ఉంటాయని తగు జాగ్రత్తలు పాటించి స్నానాలు చేయాలని సూచించారు. మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోతురాజుస్వామి గుడికి

రూ.1.07 లక్షల వితరణ

నాగాయలంక, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పోతురాజుస్వామి ఆలయం అభివృద్ధికి జల్లూరి గోపాలకృష్ణమూర్తి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు ప్రకాశరావు - శ్రీకళ దంపతులు రూ.70 వేలు, ప్రవాసాంధ్రుడు గడ్డిపాటి శ్రీనివాసరావు రూ.37 వేలు మొత్తం రూ.1.07 లక్షలను అందించారు. ఆ నగదుతో ఆలయానికి ఉత్తర, దక్షిణ దిక్కుల్లో రేకుల షెడ్లను నిర్మించినట్లు ఆలయ కమిటీ సభ్యుడు గడ్డిపాటి ప్రసాదరావు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

చల్లపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రగతి సేవా సంఘం ఆధ్వర్యంలో మహీంద్రా ఫైనాన్స్ కంపెనీ సీఎస్ఆర్ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళాపురం జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ భార్గవి, డాక్టర్ లక్ష్మీప్రియలు జనరల్ మెడిసిన్, న్యూరాలజీ విభాగాలకు సంబంధించిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. 100 మంది గ్రామస్థులు వైద్యసేవలు పొందారు. ఉద్యోగాల్లో అర్హత కలిగిన గ్రామీణ ప్రాంత యువతకు ప్రాధాన్యత ఇస్తామని మహీంద్రా ఫైనాన్స్ కంపెనీ డివిజనల్ మేనేజర్ శివప్రశాంత్ తెలిపారు. ప్రజాప్రగతి సేవాసంఘం అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెయింటర్ల సమావేశం

కోడూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మిక సంఘం(పెయింటర్స్) సమావేశం ఆదివారం కోడూరులో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మోటూరి వెంకట సన్యాసినాయుడు విచ్చేశారు. భారతీయ మజ్దూర్ సంఘం సిద్ధాంతాలను, నియమావళిని ఆయన వివరించారు. సంఘం రిజిస్ట్రేషన్ వివరాలు, రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలపై ఆయన అవగాహన కల్పించారు. కోడూరు పరిధిలో 70 మంది పెయింటర్స్ ఈ సమావేశానికి హాజరైనట్లు నాయకుడు అద్దంకి సాంబశివరావు తెలిపారు.

శాస్త్రోక్తంగా లక్ష తులసీపూజ



శ్రీకాకుళేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వర స్వామి దేవాలయంలో వేదపండితుడు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో లక్ష తులసీపూజ, కుంకుమార్చన కార్యక్రమాలను ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ మూర్తులకు వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలను జరిపించారు. దేవాలయ ముఖ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివార్లకు శాంతి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువ నాయకుడు మండలి వెంకట్రామ్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు పాల్గొన్నారు. పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకటశ్రీనివాసరావు దంపతులు స్వామి శాంతి కల్యాణం తిలకించి స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు.

నేడు గణపతి సచ్చిదానంద స్వామి ఆగమనం

మచిలీపట్నం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మైసూరు గణపతి సచ్చిదానందస్వామి సోమవారం నుంచి రెండు రోజులపాటు మచిలీపట్నంలో భక్తులకు అనుగ్రహభాషణం చేస్తారు. సోమవారం బుట్టాయిపేట దత్తాశ్రమంలో సాయంత్రం అభిభాషణం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అత్రి దత్తరాగసాగర కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో స్వామీజీ ఆశీస్సులు పొందేందుకు భక్తులు హాజరు కావాలని నల్లారి బుద్ధేశ్వరరావు కోరారు.

కాల్వగట్టు రహదారికి మరమ్మతులు

మోపిదేవి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని 11వ నెంబర్ కాల్వగట్టు రహదారికి గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టారు. దళితవాడవాసులు రాకపోకలు సాగించే ఈ రహదారిపై సర్పంచ్ నందిగం మేరీరాణి చొరవతో పిచ్చిమొక్కలు తొలగించారు. రాకపోకలకు అనువుగా గుంతలు పూడ్చి గట్టును చదును చేశారు. గ్రామ ప్రముఖులు అభిషేకరావు, నందిగం శ్రీను, కిషోర్‌బాబు, దోవారి కోటేశ్వరరావు ఉన్నారు.

జలధీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఘంటసాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయ ఆహ్వాన కమిటీ సభ్యులు పరుచూరి కృష్ణ కుటుంబసభ్యులతో ఆదివారం జలధీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు చావలి కృష్ణకిషోర్ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పరుచూరి కృష్ణ కుటుంబసభ్యులను శేషవస్త్రాలతో సత్కరించి స్వామి జ్ఞాపికను జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ అందజేశారు. దేవాలయ అభివృద్ధి కమిటీ తరఫున శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కాంగ్రెస్ నేత అర్జా అర్జునరావుకు సతీవియోగం

అవనిగడ్డ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దివిసీమలో ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు అర్జా అర్జునరావు సతీమణి సదాశివపార్వతి(70) శనివారం రాత్రి కన్నుమూశారు. మూడు నెలలుగా అనారోగ్యంతో విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె భౌతికకాయానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు, బండే రాఘవ నివాళులర్పించారు.



నాగాయలంక హైస్కూల్ పూర్వ విద్యార్థులు(1977-78 పదో తరగతి బ్యాచ్)

అపూర్వ సమ్మేళనం

నాగాయలంక, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నాగాయలంక జడ్పీ పాఠశాలలో 1977-78 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఆడిటోరియంలో అపూర్వంగా జరిగింది. పూర్వ విద్యార్థి, విశ్రాంత ఎంఈవో భవిరి శంకర్‌నాథ్ అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులు మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్, ప్రముఖ మిమిక్రీ కళాకారుడె భవిరి రవితోపాటు వివిధ రంగాల్లో ఉన్న 80 మందికిపైగా పాల్గొన్నారు. అప్పటి గురువులు ఈదర శివరామప్రసాద్, చందు కోటేశ్వరరావు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సబ్బినేని బాబూప్రసాద్, భీమా బాబూరావు, బంకు కృష్ణ పాల్గొన్నారు.

